ఆశల పల్లకిలో..

- నేడు పార్లమెంట్‌లో ఎన్నికల బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కేంద్రం
- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా డిమాండ్
- జిల్లాలో జాతీయ రహదారులు, పలు ప్రాజెక్టులకు నిధులపై ఆశలు
- సైనిక్ స్కూల్, కేంద్రీయ, నవోదయ విద్యాలయాల ఏర్పాటు ఆకాంక్ష
- బీజేపీ ఎక్కువ స్థానాలపై ఫోకస్ పెట్టడంతో కలిసొస్తుందనే భావన



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులోని నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన పంపులు



పార్లమెంట్ భవనం

మహబూబ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మొన్నటి వరకు ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వాలకు మధ్య సయోధ్య కుదరలేదు. ఎవరికి వారే పనులు చేశామని గొప్పలు చెప్పుకుంటూ పోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ఉప్పు- నిప్పులాగా తయారైంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన కొద్దిరోజుల్లోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి రాష్ట్ర సమస్యలపై విన్నవించారు. ఆ తర్వాత పలు సందర్భాల్లో పార్టీల మధ్య సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండాల్సిన అవసరంలేదని, తాను రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రంతో సఖ్యతగానే ఉంటానని రేవంత్ ప్రకటించారు. అన్నట్లుగానే కేంద్ర ప్రభుత్వానికి ఆయన పెట్టిన దరఖాస్తుల ఆమోదం పొందడం, నేవీ రాడర్ కేంద్రానికి సంబంధించి భూములు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడం, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారికి గౌరవమర్యాదలు తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంట్‌లో ఎన్నికల బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. రాష్ట్రంలో ఉన్న గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా అనేక డిమాండ్లను, ప్రతిపాదనలను కేంద్రం ఎదుట ఉంచింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం, రాష్ట్రంలో బీజేపీ మెజారిటీ ఎంపీ స్థానాలు గెలుచుకోవాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటుండటంతో పాలమూరు ఉమ్మడి జిల్లాకు సంబంధించి కొన్ని ప్రధాన డిమాండ్లపై స్పష్టత వస్తుందనే ఆశాభావం అటు బీజేపీ నేతల నుంచి, ఇటు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల నుంచి వస్తోంది. గతంలో పలు సభల సందర్భంగా కేంద్ర మంత్రులతో పాటు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కూడా ఉమ్మడి పాలమూరు జిల్లాకు కొన్ని హామీలు ఇచ్చారు. గురువారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో వాటిలో ఎన్ని ఆమోదం పొందుతాయో లేదో తేలుతుంది.



కాచిగూడ నుంచి కృష్ణ వెళ్లే డెమో రైలు

ఎంఎంటీఎస్ కల నెరవేరేనా...?

తెలంగాణ స్వ రాష్ట్రం ఏర్పడిన సమయంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగా కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టింది. ఆ సమయంలో ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో ఉన్న సింగిల్ రైల్వేలైన్‌ను డబ్లింగ్ చేయడంతోపాటు విద్యుదీకరణ పనులు చేపట్టేందుకు 2015-2016 బడ్జెట్‌లో రూ. 774 కోట్లను కాచిగూడ- మహబూబ్‌నగర్ మధ్య నిడివిలో రైల్వే డబ్లింగ్, విద్యుదీకరణ పనుల కోసం కేటాయించగా పనులు పూర్తయ్యాయి. మహబూబ్‌నగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వరకు కూడా ప్రత్యేక రైల్వే సర్వీసు కూడా నడుస్తోంది. అటు గద్వాల నుంచి రాయిచూరు వరకు కూడా రైల్వే విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. హైదరాబాద్‌కు మహబూబ్‌నగర్ వంద కిలోమీటర్ల పరిధిలోపే ఉండటంతో ఇక్కడి వరకు ఎంఎంటీఎస్ సర్వీసులు నడపాలనే ప్రతిపాదన ఉన్నది. దేవరకద్ర- కృష్ణ మధ్య నిర్మాణంలో ఉన్న రైల్వేలైన్ పూర్తి దశకు చేరుకోగా ప్రస్తుతం కాచిగూడ- కృష్ణా మధ్యలో డెమో రైల్ నడుస్తోంది. అలాగే గత సంవత్సరం రైల్వే ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసిన సందర్భంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న గద్వాల- మాచర్ల రైల్వేలైన్‌ను మంజూరు చేయాలని ప్రతిపాదన ఉండగా, దాన్ని గద్వాల- డోర్నకల్ రైల్వేలైన్‌గా మార్చి.. ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆదేశించారు. అయితే ఈ బడ్జెట్‌లో ఆ రైల్వేలైన్‌కు ఆమోదం తెలపాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. కృష్ణా- వికారాబాద్ మార్గంలో కూడా రైల్వేలైన్ మంజూరుకు గత బడ్జెట్‌లోనే నిధులు కేటాయిస్తారని భావించినప్పటికీ.. అది సాధ్యం కాలేదు. కానీ ఈ బడ్జెట్‌లో కేటాయిస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

విద్యాసంస్థలపై ఆశలు...

తెలంగాణ రూరల్ జిల్లాల్లో సైనిక్ స్కూల్స్ లేవు. ఈ నేపథ్యంలో 2015-2016లో నారాయణపేట జిల్లాలో సైనిక్ స్కూల్ మంజూరుకు ప్రతిపాదించారు. ఈ మేరకు అవసరమైన స్థలాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచి ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తంచేసింది. 2016-2017 బడ్జెట్‌లో ఈ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలను స్వీకరించిన కేంద్ర ప్రభుత్వం ఆ తర్వాత ఊసెత్తలేదు. కానీ, ఈసారి బడ్జెట్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. కొత్త జిల్లాల ప్రాతిపదికన కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు పాలమూరుకు కేటాయించాలనే డిమాండ్ ఉన్నది. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాలో నవోదయ విద్యాలయం ఉండగా, మహబూబ్‌నగర్‌లో కేంద్రీయ విద్యాలయం ఉన్నది. జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా కేంద్రం ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లే నూతన జాతీయ రహదారులను గత సంవత్సరం ప్రకటించింది. ఇందులో ప్రధానమైన కల్వకుర్తి- కరివెన (ఎన్‌హెచ్-167కే) రహదారికి ఇటీవలే కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి సాంకేతిక, పాలనాపరమైన అనుమతులు మంజూరు చేశారు. ఇటీవలే భూసేకరణ పనులు సైతం కొలిక్కిరాగా ఈ బడ్జెట్‌లో నిధులు వచ్చి రోడ్డు నిర్మాణంతో పాటు కృష్ణానదిపై వంతెన నిర్మాణం కూడా పూర్తయితే అటు పర్యాటకాభివృద్ధితోపాటు ఇటు దూరా భారం భారీగా తగ్గనుంది.

జాతీయ హోదా వచ్చేనా?

ఉమ్మడి పాలమూరు- రంగారెడ్డి- నల్గొండ జిల్లాల్లో సాగు, తాగునీరు అందించడం కోసం చేపట్టిన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి (పీఆర్ఎల్ఐ) జాతీయ హోదా ఇవ్వాలనే డిమాండ్ చాలా ఏళ్లుగా ఉన్నది. గత ప్రభుత్వం కూడా పలు ప్రచార వేదికల్లో పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వాలని ప్రకటనలు చేసినప్పటికీ.. కేంద్రంతో సయోధ్య లేకపోవడంతో అప్పట్లో హోదా సాధించడం సాధ్యం కాలేదు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన సమయంలో ఏపీలో చేపట్టిన పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించి నిధులను మంజూరు చేస్తున్న కేంద్రం.. తెలంగాణలో చేపట్టిన ఏదైనా పథకానికి జాతీయ హోదా కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పలుచోట్ల దెబ్బతిని వివాదాల్లో ఉండగా పీఆర్ఎల్ఐకి జాతీయ హోదా ఇవ్వాలనే డిమాండ్ వస్తోంది. గతంలో పాలమూరు పథకానికి జాతీయ హోదా ఇస్తామని అప్పటి బీజేపీ జాతీయ నాయకురాలు సుష్మాస్వరాజ్, గత ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ కూడా ప్రకటించారని, ఆ హామీ నెరవేర్చాలని జిల్లా ప్రజల నుంచి డిమాండ్ వస్తోంది.

నాగర్‌కర్నూల్ ఎంపీగా

పోటీ చేసేది నేనే

- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లురవి వెల్లడి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లురవి

నాగర్‌కర్నూల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ స్థానం నుంచి తాను పోటీ చేయడం ఖాయమని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లురవి స్పష్టం చేశారు. అలాగే మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతారని ఆయన తేటతెల్లం చేశారు. నాగర్‌కర్నూల్‌లో బుధవారం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి క్యాంపు కార్యాయలం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. మల్లు అనంతరాములు నుంచి వారసత్వంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నామని అనేక కష్టనష్టాలు ఎదురైనా పార్టీని వీడకుండా అంటిపెట్టుకుని ఉన్నామని చెప్పారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షులుగా ఉన్నప్పటి నుంచి ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నానని అనేక నిర్బంధాలు ఎదురైనా కాంగ్రెస్ పార్టీని ఏనాడూ వీడే యోచన చేయలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకే తాను ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించానన్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో తాను నాగర్‌కర్నూల్ స్థానం నుంచి పోటీ చేయడం తథ్యమని తేటతెల్లం చేశారు. 2004లో కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తనకు ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా నియమించినప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పెండింగ్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు, క్లియరెన్స్‌లు తేవడానికి శక్తివంచన లేకుండా కృషి చేశానని చెప్పారు. తెలంగాణ నుంచి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియామకమైన తర్వాత తన ప్రథమ కర్తవ్యం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించడానికి కృషి చేయడమేనని చెప్పారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు కాంగ్రెస్ నుంచి వేరే ఎవరో పోటీ చేస్తారని నాయకులు, కార్యకర్తలకు అపోహలు వద్దని తానే కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో ఉంటానని మల్లురవి స్పష్టం చేశారు. తన పార్లమెంట్ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేశానని పార్లమెంట్ నియోజకవర్గంలోని ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తనకు మద్దతుగా ఏఐసీసీకి తీర్మానం చేసి పంపించారని మల్లురవి పేర్కొన్నారు. విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, కౌన్సిలర్లు నిజామ్, కాంగ్రెస్ నేతలు వల్లపురెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండి.హబీబ్, అబి, గౌస్, ఖాదర్, దళిత ఉద్యోగుల సంఘం నాయకుడు వంకేశ్వరం నిరంజన్, తైలి శ్రీనివాసులు, గుడ్లనర్వ రాంచందర్, తిమ్మాజిపేట లక్ష్మీనారాయణ, శాయిన్‌పల్లి శంకర్, ఎద్దుల రాధాకృష్ణ, సలీం, తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతే అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేస్తా

కల్వకుర్తి: ప్రజల అభీష్టం మేరకే నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేస్తానని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి డాక్టర్ మల్లురవి అన్నారు. తాను పోటీ చేయడానికి అధికార ప్రతినిధి అడ్డు వస్తే ఆ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి డాక్టర్ మల్లు రవి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం నిరంతరం పని చేస్తానని అన్నారు. తప్పకుండా ఎంపీగా గెలుపొందుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

పార్లమెంట్ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనైనా గెలిచి తీరాలి: ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనైనా గెలిచి తీరాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కల్వకుర్తి ప్రాంతానికి పరిశ్రమలు రావాల్సినవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గడిచిన ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పట్టం కట్టినట్లు, పార్లమెంట్ స్థానాన్ని కూడా కాంగ్రెస్సే గెలువాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే అన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కాయితీ ఆశాదీప్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎజాస్, నాయకులు హనుమానాయక్, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, పాండుగౌడ్, జమ్ముల శ్రీకాంత్, రమాకాంత్‌రెడ్డి, పడకంటి వెంకటేశ్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో..

రేపటి నుంచి ప్రత్యేక పాలన

- నేటితో మాజీలు కానున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌లు
- పంచాయతీ కార్యదర్శి, స్పెషల్ అధికారికి జాయింట్ చెక్‌పవర్
- ఇప్పటికే ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారుల నియామకం



మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబ్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయం

మహబూబ్‌నగర్, జనవరి 31: సర్పంచుల పదవీకాలం ముగిసింది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించని కారణంగా ప్రత్యేక పాలనకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గురువారంతో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో వారి స్థానంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయించింది. దీంతో తమ పదవీకాలం పొడగించాలని కోరుతున్న సర్పంచుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఉమ్మడి జిల్లాలో 1,690 గ్రామ పంచాయతీలు ఉండగా, మహబూబ్‌నగర్ జిల్లాలో 441 ఉన్నాయి. ఇప్పటికే పంచాయతీలకు అధికారులను నియమించింది. ఇప్పటి వరకు గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల విషయంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌కు చెక్‌పవర్ ఉండగా, ప్రత్యేక పాలనలో గ్రామపంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారికి చెక్‌పవర్ ఇవ్వనున్నారు. సర్పంచ్‌లు గ్రామ పంచాయతీలకు సంబంధించిన రికార్డులనిన్నింటినీ అధికారులకు అప్పగించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలుస్తోంది. గురువారం అందుకు మార్గదర్శకాలు వెలువడనున్నాయి. శుక్రవారం ప్రత్యేక అధికారులకు అధికారాలు బదలాయించనున్నారు.

ఇప్పటికే సిద్ధమైన యంత్రాంగం

ప్రత్యేక పాలన కోసం జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే సన్నద్ధమైంది. గెజిటెడ్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించనుంది. మేజర్ గ్రామ పంచాయతీలకు మండల ఉన్నతాధికారులను నియమించేలా ఏర్పాట్లు చేశారు. ఈ గ్రామాలకు మండల పరిధిలోని మండల అధికారులు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్‌భగీరథ ఏఈలు, వ్యవసాయ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఈవోఆర్‌డీ, ఉద్యానవన శాఖ, విద్యుత్ తదితర శాఖల అధికారులను ఇన్‌చార్జీలుగా నియమిస్తున్నారు. కాగా సర్పంచ్‌లు తాము చేసిన పనులకు బిల్లుల పెండింగ్‌లో ఉన్నందున పదవీ కాలాన్ని మరికొంత పొడగించాలని కోరుతున్నారు. మరోవైపు పంచాయతీలలో ఉన్న నిధులను ఖాళీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైమాస్ట్ లైట్ల పేరుతో అధిక బిల్లులు డ్రా చేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పాత తేదీలపై కొందరు తీర్మానాలు చేసి, తీసి పెట్టుకున్నారు. పలు పనులకు సంబంధించి ముందుగానే ఎంబీలు సిద్ధం చేసి ఉంచుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. పంచాయతీలలో ప్రస్తుతం నిధులన్నీ దాదాపు ఖాళీ అయినట్లు తెలుస్తోంది.

మానవ తప్పిదాలతో..

అడవుల దగ్ధం

- అమ్రాబాద్ అభయారణ్యంలో అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ ప్రత్యేక కార్యాచరణ
- 50 మంది టైగర్ ప్రొటెక్షన్ వాచర్ల నియామకం



నల్లమల అడవిలో ఎండిపోయిన చెట్టు

మన్ననూర్, జనవరి 31: వేసవి వచ్చిందంటే చాలు మానవ తప్పిదాల కారణంగా నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఫిబ్రవరి నుంచి మే చివరి వారం వరకు అడవుల్లో ఎక్కడో ఒక చోట మంటలు ఏర్పడి, మూడేళ్లుగా అడవి అగ్నికి ఆహుతవుతోంది. అడవుల్లో మంటలు రేగితే పెద్దపులులతో పాటుగా చిరుతలు, జింకలు, దుప్పులు తదితర వన్యప్రాణులన్నీ వేడికి తట్టుకోలేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే ఆస్కారం ఉంటుంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర అటవీ శాఖ ఈ ఏడాది పత్యేక కార్యాచరణ రూపొందించింది.

మంటలతో వందల హెక్టార్ల అడవి దహనం

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ దేశంలోనే రెండో అతిపెద్ద పులుల అభయారణ్యం. నాగర్జునసాగర్, నాగర్ కర్నూల్ జిల్లాల పరిధిలో విస్తరించిన ఏటీఆర్ అడవులు 2,611 చదరపు కిలో మీటర్ల పొడవున ఉన్నాయి. ఉగాది నుంచి మొదలయ్యే వసంత రుతువులో ఆకు మొత్తం రాలుతుంది. దాంతో అడవిలో విస్తారంగా ఎండిన ఆకులు, పుల్లలు, ఎండు గడ్డి దట్టంగా పేరుకుంటుంది. చిన్నపాటి నిప్పు రవ్వలు పుట్టినా ఎండు ఆకులు, గడ్డి రాజుకుని మంటలు మొదలవుతాయి. అవి పెద్దగా మారి, అడవి దహనమవుతోంది. ఇలా ఏటా వందల హెక్టార్ల అడవి కాలిపోతుంటుంది.

చిన్న తప్పిదాల వల్ల ప్రమాదాలు..

నల్లమల అటవీ ప్రాంతంలోని పెంటల్లో నివసించే ఆదివాసీ చెంచులు వేసవిలో ఇప్పపువ్వు సేకరణలో భాగంగా చిన్నపాటి తప్పిదాలు చేస్తుంటారు. ఇప్పపూలను సులభంగా ఏరుకునేందుకు చెట్టు కింద ఉండే గడ్డిని కాల్చి, భూమిని నునుపుగా చేస్తారు. ఈ క్రమంలో మంటలు అడవంతా వ్యాపించే ఆస్కారం ఉంది. దాంతో పాటు శ్రీశైలం, హైదరాబాద్ రహదారిపై రాకపోకలు సాగించే వారు బీడీ, సిగరెట్లు వంటివి కాల్చి, అడవిలోకి విసిరేయడం వలన మంటలు చెలరేగడానికి మరో కారణంగా చెప్పొచ్చు. ఎండలు ముదురుతున్న వేళ ఎండుగడ్డి రెమ్మలు రాపిడికి గురై, నిప్పు రవ్వలు పడి కూడా మంటలు పుడుతాయి.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

నల్లమల అభయారణ్య ప్రాంతంలో మంటలు ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, నల్లమల చెంచులకు అవగాహన కల్పిస్తున్నాం. అటవీ సమీప గ్రామాల ప్రజలకు కళాజాత ప్రదర్శనల ద్వారా అడవులను కాపాడుకునే విధానంపై గ్రామ సభలు నిర్వహిస్తున్నాం. శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై వెళ్లే యాత్రికులకు అడవిలో ఎక్కడా ఆగరాదని చెబుతున్నా. సిగరెట్లు కాల్చితే జరిమానాలు విధిస్తున్నాం.

- ఆదిత్య, అటవీ రేంజ్ అధికారి, మద్దిమడుగు

మంటల అదుపునకు ప్రత్యేక కార్యాచరణ

అడవుల దహనాన్ని అరికట్టేందుకు వేసవి మొదటి నుంచే అమ్రాబాద్ పులుల అభయారణ్య పరిధిలో ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. మన్ననూరు, మద్దిమడుగు, అమ్రాబాద్, దోమలపెంట, కొల్లాపూర్ రేంజ్‌ల పరిధిలో స్థానిక చెంచులతో పాటు చెంచేతర యువకులను 50 మందిని టైగర్ ప్రొటెక్షన్ వాచర్లుగా నియమించి, మంటలు ఆర్పే విధానంపై వారికి అటవీశాఖ నిపుణుల ద్వారా తర్ఫీదు ఇచ్చారు. మంటలు ఆర్పే యంత్రాలను సిద్ధం చేశారు. ప్రతీ రేంజ్‌లో మూడు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా బౌరాపూర్, రాంపూర్, తాటిగుండాల, శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై గల రాసమల్లోని బావి వద్ద ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశారు. ఫైర్ వాచర్లు 24 గంటల పాటు అక్కడే ఉండి, అడవిలో మంటలు పుట్టకుండా వంతుల వారీగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

అదుపులోకి మంటలు

దోమలపెంట: వేసవికి ముందే అమ్రాబాద్ అభయారణ్యంలో కార్చిచ్చుతో మంటలు చెలరేగుతున్నాయి. బుధవారం నాగర్‌కర్నూలు జిల్లా దోమలపెంట రేంజ్ పరిధిలోని వటువర్లపల్లి సెక్షన్ కొల్లంపెంట, పల్లెబైలు, నక్కెర్లపెంట ప్రాంతాలలో సుమారు 30 హెక్టార్ల విస్తీర్ణంలో మంటలు చెలరేగాయి. అటవీశాఖ అధికారులు, బేస్‌క్యాంపు వాచర్లు, ఫైర్‌వాచర్లు సుమారు 15 మంది రెండు బ్లోయర్ల సహాయంతో ఎట్టకేలకు మంటలను అదుపు చేశారు. కొల్లంపెంట, కొమ్మెనపెంట ప్రాంతంలో మంగళవారం రాత్రి 20 హెక్టార్ల అటవికి మంటలు అంటుకోవడంతో అతి కష్టంతో అదుపు చేసినట్లు దోమలపెంట ఎఫ్‌ఆర్‌వో గురుప్రసాద్ తెలిపారు. మంటలను అదుపు చేసేందుకు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి కూడా రాత్రి సమయంలో అటవీశాఖ సిబ్బందితో పాటు కొమ్మెనపెంట అటవీ ప్రాంతంలో మంటలు అంటుకున్న ప్రాంతాల్లో పర్యటించారని ఆయన తెలిపారు.



నల్లమలలోని వటవర్లపల్లి సెక్షన్‌లో మంటలను అదుపు చేస్తున్న అటవీ సిబ్బంది

ప్రత్యేక ఫైర్‌లైన్ల ఏర్పాటు

ఏదైనా ఒక చోట మంటలు ఏర్పడితే అవి.. అడవంతా వ్యాప్తి చెందకుండా ఫైర్‌లైన్లను ఏర్పాటు చేశారు. ఫైర్‌లైన్ అంటే ఎండుటాకులు, గడ్డి వంటి వ్యర్థాలను అటవీ సిబ్బంది మంటలు పెట్టి, మొత్తం కాలాక ఆర్పేస్తారు. వన్యప్రాణులు సంచరించేందుకు వీలుగా, అవి రహదారిని క్రాస్ చేసేందుకు ప్రత్యేక వ్యూ లైన్లను సైతం ఏర్పాటు చేశారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు

- నేటి నుంచి 15వ తేదీ వరకు..
- హాజరుకానున్న 45,299 మంది విద్యార్థులు
- కేంద్రాలను పరిశీలించిన డీఐఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 31: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జనరల్ ఇంటర్ బైపీసీ, ఎంపీసీ, వొకేషనల్ ప్రథమ, ద్వితీయ తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. నేడు గురువారం నుంచి 15వ తేదీ వరకు ఎంపిక చేసిన బ్యాచ్‌ల వారీగా పరీక్షలు కొనసాగుతాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధాహ్నం రెండు గంటల నుంచి సాయంత్ర ఐదు గంటల వరకు రెండో సెషన్ కొనసాగుతాయి. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 47 కేంద్రాలను ఏర్పాటు చేశారు. డీఐఈవో డాక్టర్ శ్రీధర్‌సుమన్ బుధవారం మిడ్జిల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను సీఎస్, డీవోలు, కార్యాలయ సూపరింటెండెంట్ పర్యవేక్షించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. ప్రైవేట్ కళాశాలల్లోని కేంద్రాల్లోనూ అన్ని వసతులు కల్పించాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు జిల్లాల పరిధిలో 45,299 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.



మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐఈవో

తగ్గిన ఉల్లి ధరలు

దేవరకద్ర, జనవరి 31: ఉల్లి ధరలు తగ్గాయి. దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పండించిన ఉల్లిని విక్రయించేందుకు బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు తెచ్చారు. వ్యాపారులు నిర్వహించిన వేలంలో క్వింటాలుకు గరిష్ఠంగా రూ.1,600, కనిష్ఠంగా. రూ.1,150 ధరలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి ఎల్లయ్య తెలిపారు. మార్కెట్‌కు 369 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి రాగా.. గత వారంకంటే ఈ వారం రూ.400 ధర తగ్గిందన్నారు. ఇప్పుడు సీజన్ కావడంతో ఉల్లి మార్కెట్‌కు వస్తోంది. ఇంకా పెద్ద మొత్తంలో మార్కెట్‌కు ఉల్లి రానున్నట్లు కార్యదర్శి చెప్పారు. తెల్లగా, నాణ్యతగా ఉన్న ఉల్లికి డిమాండ్ ఉండగా, మార్కెట్‌కు మాత్రం ఎర్ర ఉల్లినే అధికంగా వచ్చింది. వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఎర్ర ఉల్లిని కొనుగోలు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హన్వాడ, జనవరి 31 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని పెద్ద దర్పల్లి గ్రామానికి చెందిన జిల్లెల వీరేశం(45) పురుగుల మందు తాగి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రవినాయక్ తెలిపారు. ఈనెల 29న ఇంట్లో కుటుంబ సభ్యులతో భూమి పంచి ఇవ్వాలని వీరేశం గొడవ పడ్డాడు. గొడవ పడినా తల్లి భూమి ఇవ్వడం లేదని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో

జెండా ఆవిష్కరణకు సిద్ధపడ్డ ఉద్యోగి సస్పెన్షన్

మహమ్మదాబాద్, జనవరి 31 : మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల పశువైద్యశాల కార్యాలయంలో రిపబ్లిక్‌డే వేడుకల్లో భాగంగా మద్యం మత్తులో జెండా ఆవిష్కరణ చేయబోయిన ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడింది. పలు పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన వార్తా కథనాల ఆధారంగా సంబంధిత ఉద్యోగిపై అధికారులు విచారణ చేపట్టి జనార్ధన్‌ను సస్పెండ్ చేస్తు ఉత్తర్వులు ఇచ్చారు. జనవరి 27న మీడియాలో వచ్చిన కథనాలపై స్పందించి ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు పశువైద్య అధికారి తెలిపారు.

స్థలం కోసం ఇరువర్గాల మధ్య వివాదం

- ఘటనా స్థలానికి చేరుకున్న అదనపు కలెక్టర్, ఏఎస్పీ
- ఇరువర్గాలకు నచ్చజెప్పిన అధికారులు
- రాజీతో సద్దుమణిగిన గొడవ

జడ్చర్ల, జనవరి 31 : స్థలం కోసం ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకున్న సంఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని లక్ష్మీనగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఇప్పటికే నిర్మించిన దేవాలయానికి ప్రహరీని కాలనీలోని ఓ వర్గానికి చెందిన కాలనీవాసులు నిర్మాణం చేపట్టగా, శ్మశానవాటికకు వెళ్లేందుకు దారి కోసం స్థలం కేటాయించాలంటూ మరో వర్గం వారు అడ్డుకోవడంతో వివాదం చోటు చేసుకుంది. ఈ స్థలం అంతా ప్రభుత్వానికి చెందిన పది శాతం భూమిలోనే ఉండడం గమనార్హం. ఘటనా స్థలానికి అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అదనపు ఎస్పీ రాములు చేరుకుని, ఇరువర్గాలతో మాట్లాడారు. రాజీ మార్గంలో వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించారు. ఇరువర్గాలు రాజీ పడడంతో వివాదం సద్దుమణిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఎస్సై చంద్రమోహన్‌లు బందోబస్తు నిర్వహించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

ఉండవల్లి, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని జాతీయ రహదారిపై కంచు పాడుకు వెళ్లే దారిలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్సై బాలరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన వడ్డే శివకుమార్ కర్నూలులో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. అతడి భార్య నాగేశ్వరి నెలరోజుల క్రితం పుట్టినిల్లయిన పల్లెపాడుకు వెళ్లింది. శివకుమార్ మంగళవారం మధ్యాహ్నం భార్యకు ఫోన్ చేసి పల్లెపాడుకు వస్తున్నానని తెలిపాడు. కానీ ఎంతకీ రాకపోవడంతో ఆమె ఫోన్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తి లిఫ్ట్ చేసి మాట్లాడారు. కంచుపాడుకు వెళ్లే మట్టిరోడ్డు సమీపంలోని మొక్కజొన్న ఫ్యాక్టరీ వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు చెప్పడంతో భార్య, బంధువులు అక్కడికి చేరుకున్నారు. శివకుమార్‌ను అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు భార్య నాగేశ్వరి బుధవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

» నాగర్‌కర్నూల్ మండలం పుల్జాలలో ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 31 : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వల కాళ్లకు చిక్కుకుని మామిళ్ల అడివయ్య (39)మృతి చెందినట్లు ఎస్ఐ మహేందర్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని పుల్జాల గ్రామానికి చెందిన అడివయ్య గ్రామంలో ఉన్న చెరువులో చేపలు పట్టడానికి మంగళవారం మధ్యాహ్నం వెళ్లగా ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగాడు. స్థానికులు గాలించినప్పటికీ శవం లభించలేదు. బుధవారం మధ్యాహ్నం శవం బయటకు రావడంతో వెలికి తీశారు. ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యులు ఫి ర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మద్యం మత్తులో ఉరి పెట్టుకుని అంచె హుస్సేన్(45) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ మహేందర్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాల గ్రామానికి చెందిన అంచె హుస్సేన్ మద్యం మత్తులో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య బాలమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై మృతుని తమ్ముడు అంచె రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

» పట్టుబడిన ఇద్దరు మహిళలు
» పరారైన నిర్వాహకుడు



వ్యభిచార గృహంలో లభ్యమైన మద్యం సీసాలు, కండోమ్స్ ప్యాకెట్స్

గద్వాల క్రైం, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న కాలనీలో కొనసాగుతున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు పరారయ్యాడు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనపై పట్టణ ఎస్ఐ శ్రీకాంత్, కాలనీవాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఐడీఎస్ఎంటీ కాలనీలోని సురేశ్ అనే వ్యక్తి ఇంటిని కేటీదొడ్డి మండలానికి చెందిన వీరేశ్ అనే వ్యక్తి అద్దెకు తీసుకున్నాడు. అందులో కొన్ని రోజులుగా ఇతర ప్రాంతాల నుంచి మహిళలను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి తిరుపతికి చెందిన ఓ మహిళ, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన మరో మహిళను ఇంట్లో ఉంచిన వీరేశ్ గేటుకు తాళం వేసి బయటకు వెళ్లాడు. గేటుకు తాళం వేసి ఉండటం, తలుపులు తెరిచి ఉన్న ఇంట్లో లైట్లు వెలుగుతుండటాన్ని కాలనీవాసులు గమనించారు. ఇంట్లోని మహిళలను బయటకు పిలిచి విచారించగా తమను వీరేష్ అనే వ్యక్తి తీసుకొచ్చాడని వారు తెలిపారు. అనంతరం ఆ మహిళలు వీరేశ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో అతడు అటునుంచి అటే పరారయ్యాడు. ఈ విషయంపై కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, వారక్కడికి చేరుకొని ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా మద్యం సీసాలు, కండోమ్స్ పాకెట్లు లభ్యమయ్యాయి. వీరేష్ ఫోన్ స్విచ్ఆఫ్ చేసాడని, అతడి కోసం గాలిస్తామని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బావిలో పడి వ్యక్తి మృతి

గద్వాల, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లాలో గద్వాల మండల పరిధిలోని పూడూరు గ్రామంలో సవారన్న (55) అనే వ్యక్తి బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు. సవారన్న భార్య కొంతకాలం క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఆయన కుమారుడు రాఘవేంద్రతో కలిసి జీవిస్తున్నాడు. ఆయన మంగళవారం రాత్రి ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ ఎస్ఐ ఆనంద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బీఎడ్ ఫ్రెషర్స్ డే

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 31 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ బీఎడ్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాలమూరు విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ డా.బషీర్‌అహ్మద్, ఎంబీఏ విభాగం హెచ్‌వోడీ అర్జున్‌కుమార్, వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జయంతి, జయకుమార్, అధ్యాపకులు వేణుగోపాల్, స్పందన, హరిత, అనిత, మౌనిక, చంద్రశేఖర్, శేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక దృఢత్వం

» పోలీసుల స్పోర్ట్స్ మీట్ బహుమతుల ప్రదానోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు


ఎస్పీకి మెమెంటో అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 31 : క్రీడలు మానసిక దృఢత్వాన్ని ఇస్తాయని రాష్ట్ర అబ్కారీ, టూరిజం, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్ బహుమతులు, ముగింపు కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ ఉదయ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండడానికి వయస్సుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరు ప్రతీ రోజు కనీసం ఒక గంట సమయం వ్యాయామం చేస్తే రోగాల బారిన పడకుండా ఉంటారన్నారు. పోలీస్ అధికారులను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పోలీసులను ఆదర్శంగా తీసుకుని ప్రతీ శాఖలోను ప్రతీ ఒక్కరు క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ ఎస్పీ రామేశ్వర్‌రావు, డీఎస్పీ మోహన్‌కుమార్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హమాలీ వర్కర్స్‌కు సమగ్ర చట్టం చేయాలి


పాలమూరు పట్టణంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు

పాలమూరు, జనవరి 31 : హమాలీ, మిల్ వర్కర్స్‌కు ఉపాధితో కూడిన సమగ్ర చట్టాన్ని రూపొందించి, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం డిమాండ్ చేశారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జిల్లా రైస్ అండ్ ఆయిల్‌మిల్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ అనుబంధం)జిల్లా ఐదో మహాసభల సందర్భంగా కొత్తగంజి నుంచి తెలంగాణ చౌరస్తా వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోజ్‌గార్డెన్‌లో నిర్వహించిన సభలో హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కె.సూర్యంలు ప్రసంగించారు. హమాలీ అండ్ మిల్ వర్కర్స్‌కు ఉపాధితో కూడిన సమగ్ర చట్టాన్ని రూపొందించి, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. వీరందరికి కార్మిక చట్టాలు అమలు కాని స్థితి నేడు నెలకొని ఉందన్నారు. రోజురోజుకు కొత్త పరిజ్ఞానంతో యాంత్రీకరణ వల్ల మిల్లుల పెరుగుదల విపరీతంగా జరుగుతోందన్నారు. కానీ కార్మికుల భద్రతా చర్యలు మాత్రం శూన్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యతను మరిచిపోయాయన్నారు. నేటి ప్రభుత్వం కనీస వేతనాల 73 జీవోలను సవరించి, ఈఎస్ఐ, పీఎఫ్ అమలుచేసి పనిభద్రత, గ్రాట్యుటీ, ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయాలని, నేటి ధరలకు అనుగుణంగా కార్మికులకు నెలకు రూ.26వేలు అందజేయాలన్నారు. మిల్లు మేస్త్రీలుగా పనిచేస్తున్న క్రమంలో ఎలివేటర్పై నుంచి కిందపడి వెన్నెముక, చేతులు, కాళ్లు విరిగి, తల పగిలి చనిపోయే పరిస్థితిలో ఉన్నారని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాంచందర్, ఐఎఫ్‌టీయూ నాయకులు పి.అరుణకుమార్, దేవదానంలు ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి వలస వచ్చిన హమాలీలుగా పనిచేస్తున్న క్రమంలో కాళ్లు, చేతులు విరిగి చనిపోతున్న వారికి ప్రభుత్వం, యాజమాన్యం అంతర్రాష్ట్ర చట్టాన్ని అమలు చేసి హక్కులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎం.నరసింహులు, పి.దాసు, ఆర్.కొండన్న, బి.శ్రీనివాసులు, లాలన్‌యాదవ్, నరసింహులు, సతీష్, పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు మారుతీ, సీతారాం, కార్మికులు పాల్గొన్నారు.

వ్యాపార దృక్పథంతో పంటల సాగు

» ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

బిజినేపల్లి, జనవరి 31 : రైతులు వివిధ పంటల సాగును వ్యాపార దృక్పథంతో చేపడితేనే అధిక లాభాలను ఆర్జించవచ్చని ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. మండలంలోని పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆడిటోరియంలో బుధవారం ఇక్రిశాట్, వేరుశనగ అంతర్జాతీయ ఎగుమతుల సంస్థ ముంబయి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేరుశనగ రైతులు, శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యధికంగా వేరుశనగ పంటను సాగు చేస్తారని అన్నారు. వేరుశనగ పంట సాగు చేసే రైతులు ముఖ్యంగా నాణ్యమైన విత్తన ఎంపిక, విత్తనశుద్ధి, మేలైన, సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడి పొందవచ్చన్నారు. నాణ్యమైన విత్తనాన్ని రైతులు తమ స్వంత పొలాల్లోనే పండించుకోవడం ద్వారా విత్తన ఖర్చు తగ్గడంతో నాణ్యమైన విత్తనాలు విత్తుకోవడంతో పంట దిగుబడి పెరుగుతుందన్నారు. చీడ పీడల నివారణకు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు సలహాలు తీసుకోవాలని వివరించారు. రైతులు పండించిన పంటను ఎగుమతి చేయాలంటే అందుకు ఉండాల్సిన పంట నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. అలాగే మంచి దిగుబడినిచ్చే వేరుశనగ రకాలు, ఈ ప్రాంతానికి అనువైన విత్తన రకాలను రైతులకు వివరించారు. పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించే వరకు నిల్వ చేసేందుకు పిక్స్‌బాగ్‌ల గురించి తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.రఘురాంరెడ్డి, విస్తరణ సంచాలకులు డాక్టర్ వి.సుధారాణి, ఐఓపీఈపీసీ అధ్యక్షుడు రుతుపర్న డొలె, నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వాణిశ్రీ, తానా ఐఓపీఈపీసీ కిషోర్, డాక్టర్ సూదిని హరికిషన్, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజా మంగతాయారు సేవలు మరువలేనివి

» పీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎల్‌బీలక్ష్మికాంత్ రాథోడ్


గిరిజామంగతాయారు దంపతులను సన్మానిస్తున్న వీసీ, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 31 : పాలమూరు యూనివర్సిటీ ప్రారంభం నుంచి నేటివరకు పదిహేను ఏళ్లుగా పనిచేసిన పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గిరిజా మంగతాయారు సేవలు మరువలేనివని పీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎల్‌బీ.లక్ష్మికాంత్‌రాథోడ్ అన్నారు. బుధవారం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. గిరిజా మంగతాయారు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా, సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తు కెమిస్ట్రీ విభాగంలో ఎన్నో పరిశోధనలు చేసి ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. అనంతరం గిరిజాను, ఆమె భర్త మధుసూదన్‌రావును కలిపి పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ.లక్ష్మీకాంత్‌రాథోడ్, అధికారులు ఘనంగా సన్మానించి, మెమెంటోలు అందించారు. ఓయూ సీనియర్ ప్రొఫెసర్ రమణారావు, రిటైర్డ్ ఐఏఎస్ రామచంద్రుడునాయక్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిండి పవన్‌కుమార్, వీసీ ఓఎస్డీ, కళాశాల డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై లాఠీచార్జి అమానుషం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాలమూరు, జనవరి 31 : బాధిత రైతులపై అక్టోబరు 22వ తేదీన జరిగిన లాఠీచార్జి అమానుషమైందని చిత్తనూరు ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ సంఘాల నాయకులు అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పలు విషయాలను వెల్లడించారు. కుట్రపూరితంగా జరిగిన లాఠీచార్జిలో అనేక మంది రైతులు గాయపడ్డారన్నారు. మరికొందరు గాయపడి మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. లాఠీచార్జి అనంతరం 78మందిపై అక్రమ కేసులు బనాయించడం, చిత్రహింసలకు గురిచేయడం దారుణమన్నారు. లాఠీచార్జి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. తక్షణమే చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలన్నారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి, నారాయణపేట జిల్లా కన్వీనర్ ఎం.వెంకట్రాములు, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.ఖలీల్, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, జె.చక్రవర్తి, కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డి.చంద్రశేఖర్, పి.యాదగిరి, టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, జలాల్‌పాషలు పాల్గొన్నారు.

పీయూ రిజిస్ట్రార్‌గా పిండి పవన్ కుమార్


వర్సిటీ రిజిస్ట్రార్‌గా నియామక ప్రతం అందుకుంటున్న పిండి పవన్‌కుమార్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 31 : పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ పిండి పవన్‌కుమార్ నియామకమయ్యారు. నిన్నటివరకు రిజిస్ట్రార్‌గా కొనసాగిన ప్రొఫెసర్ గిరిజా మంగతాయారు పదవీ విరమణ జరగడంతో బుధవారం రిజిస్ట్రార్‌గా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్‌బీ.లక్ష్మీకాంత్ రాథోడ్ నియామక పత్రాన్ని అందజేశారు. పీయూ రిజిస్ట్రార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన పిండి పవన్‌కుమార్‌ను కళాశాల డైరెక్టర్ ఓఎస్డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, అదనపు పరీక్షల నిర్వహణ అధికారులు డాక్టర్ శాంతిప్రియా అజ్మీర, డాక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ పిన్సిపాల్ డా.కృష్ణయ్య పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పత్తి కొనుగోలు ఆపటం లేదు

పాలమూరు, జనవరి 31 : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ఆధ్వర్యంలో చేపట్టిన పత్తి కొనుగోలు కేంద్రాలను నిలిపివేస్తున్నట్లు తప్పుడు వదంతులను రైతులు, ప్రజలు నమ్మొద్దని మహబూబ్‌నగర్ బ్రాంచ్ శాఖాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ నోడల్ ఏజెన్సీగా ప్రస్తుత పత్తి సీజన్‌లో పత్తి ఎంఎస్‌పీ కార్యకలాపాలను చేపట్టిందన్నారు. సమీపంలోని కొనుగోలు కేంద్రం, ఎంఎస్‌పీ రేట్లు తదితర వాటి గురించి మరింత వివరాల కోసం రైతులు సీసీఐ వెబ్‌సైట్(డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఓటీసీఓఆర్‌పీ.ఓఆర్‌జీ.ఐఎన్)ని సందర్శించాలన్నారు. కోట్-అల్లీ(సీఓటీటీ-ఏఎల్ఎల్‌వై) మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. రైతులందరు ఎంఎస్‌పీ కింద నాణ్యమైన గ్రేడ్ పత్తి సేకరణను కొనసాగిస్తుందని, రైతులు తమ పత్తిని సీసీఐకి అమ్మటంలో భయపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. మరేదైనా సహాయం కోసం రైతులు జిల్లా కేంద్రంలోని సీసీఐ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 31 : డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపొద్దని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పి.కిశోర్, ఆర్టీవో ఎస్.నరేష్‌లు అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మౌంట్ బాసిల్ హైస్కూల్‌లో ప్రైవేట్ పాఠశాలల బస్సుల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, వాహన చట్టాలను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడుపాలని సూచించారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే అప్రమత్తంగా మెలగాలని అన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్ర సలహాదారుగా శివకుమార్



తిమ్మాజిపేట, జనవరి 31 : ఉమ్మడి పాలమూరు జిల్లా నెహ్రూ యువ కేంద్ర సలహాదారు సభ్యుడిగా తిమ్మాజిపేట మండల కేంద్రానికి చెందిన శివకుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ తాను గతంలో సోషల్ మీడియాలో కన్వీనర్‌గా పని చేశానని మినిస్ట్రీ ఆఫ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు తన సేవలను గుర్తించడం హర్షదాయకమన్నారు. సలహాదారు కమిటీలో సభ్యునిగా నియామకం చేసినందుకు అభినందనలు తెలిపారు. గ్రామస్థాయిలో యువ కేంద్రం ఆధ్వర్యంలో క్రీడల నిర్వహణకు కృషి చేస్తానన్నారు. క్రీడలు స్నేహాన్ని పెంచుతాయని ప్రతీ ఒక్కరు క్రీడలపై ఆసక్తి కనబర్చేలా చూస్తానన్నారు.

వీఆర్‌ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

పెంట్లవెల్లి, జనవరి 31 : వీఆర్‌ఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని బుధవారం కొల్లాపూర్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ వెంకటయ్య మాట్లాడుతూ గత ఆరు నెలలుగా వీఆర్‌ఏలకు జీతాలు లేక దుర్భర జీవితం గడుపుతున్నామని వారు పేర్కొన్నారు. అదేవిధంగా 51సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏలను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ప్రమోషన్లు కల్పించలేదని, అదేవిధంగా వారసత్వ ఉద్యోగమివ్వలేదని వారు పేర్కొన్నారు. వీఆర్‌ఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వారు కోరారు. వీఆర్‌ఏలు ఈశ్వరయ్య, బాలరాజు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలి



కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కె.సీతారామారావుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 31: జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్లు వెచ్చించి నూతన కలెక్టరేట్ భవనాలను నిర్మించిన ప్రభుత్వం అందులో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి మాత్రం కనీస వేతనాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కేవలం 14 మంది సిబ్బందితో కలెక్టరేట్ భవనాన్ని శుభ్రం చేయడం కష్టతరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అదనపు సిబ్బందిని నియమించి వేతనాలు పెంచడంతో పాటు వారికి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అలివేలమ్మ, భాగ్యమ్మ, సుజాత, కృష్ణవేణి, ఎల్లమ్మ, మంజుల, వెంకటమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పరీక్ష వైద్య శిబిరం విజయవంతం

బిజినేపల్లి, జనవరి 31 : ఎన్ఆర్ఐ టి.రాంచంద్రారెడ్డి ఆర్థిక సాయంతో స్వస్థత క్యాన్సర్ కేర్ ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో మండలంలోని నంది వడ్డెమాన్‌లో చేపట్టిన ఉచిత క్యాన్సర్ పరీక్ష వైద్య శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి 150 మంది మహిళలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారిలో సమస్య తీవ్రతను బట్టి ఉచితంగా మందులను అందించడంతో పాటు మెరుగైన వైద్యం అవసరమున్న వారిని హైదరాబాద్‌లోని క్యాన్సర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. వైద్య శిబిరం విజయవంతం కావడానికి గ్రామ సర్పంచ్ వంగ సుదర్శన్ గౌడ్, జగత్ చంద్రయ్య, గ్రామ యువకులకు సహకారం అందించారని తెలిపారు.

నియామక పత్రాల కోసం హైదరాబాద్‌కు స్టాఫ్ నర్సులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 31: జిల్లా నుంచి కొత్తగా ఎంపికైన స్టాఫ్ నర్సులు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకునేందుకు బుధవారం హైదరాబాదు బయలుదేరి వెళ్లారు. సమీకృత అధికారుల కలెక్టరేట్ సముదాయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన నర్సులకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్, ఆర్టీసీ ఆర్‌ఎంవో బాల సరస్వతి సాగనంపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ మాట్లాడుతూ జిల్లా నుంచి మొత్తం 242 మంది స్టాఫ్ నర్సులు ఎంపిక కాగా సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకునేందుకు బుధవారం 240 మంది వెళ్లారని పేర్కొన్నారు. అనివార్య కారణాలతో మిగతా ఇద్దరు హాజరు కాలేదని తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవినాయక్, రేణయ్య, ఆర్టీసీ సీఐ బాల్‌రెడ్డి, జిల్లా వైద్యశాఖ, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయించాలి

అమ్రాబాద్ జనవరి 31: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి విద్యార్థుల యొక్క ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రిలీజ్ చేయించాలిని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌ను బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర కార్యదర్శి పి.రాజుతో కలిసి విజ్ఞప్తి చేసినట్లు నాగర్‌కర్నూలు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నల్లవెల్లి యశ్వంత్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు తన ఎమ్మెల్సీ నిధులను కేటాయించి అభివృద్ధి పరచాలని కోరినట్లు ఆయన వెల్లడించారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిజినేపల్లి వాసి నియామకం



ఐఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడి చేతుల మీదుగా నియామక పత్రం తీసుకుంటున్న పర్వతాలు

బిజినేపల్లి, జనవరి 31 : ఐఎన్టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బిజినేపల్లి గ్రామానికి చెందిన బంగారి పర్వతాలును నియమిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి హసీలింద్ర ప్రసాద్, జాతీయ ఉపాధ్యక్షుడు ఏకే చౌదరి, రాష్ట్ర ఐఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బుద్ధారం మురహరిలు బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఐన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న బంగారి పర్వతాలు కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం నాగర్ కర్నూల్ జిల్లాలో శక్తివంచన లేకుండా పాటుపడ్డావని అభినందించడంతో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం చేయటం ద్వారా కాంగ్రెస్ పార్టీ కోసం మరింత ఉత్సహంతో పనిచేస్తానని అన్నారు. బంగారి పర్వతాలను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక కావడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, ఐన్టీయూసీ నాయకులు శ్రీశైలం, మ్యాతరి సత్యం తదితరులు హర్షం వ్యక్తం చేశారు. నియామక పత్రం అందజేసిన వారిలో ఐన్టీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయిబాబా, మహిళా అధ్యక్షురాలు మన్నే శరణ్య రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోరింగ్ శ్రీనివాసులు తదితరులు ఉన్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో డాక్యుమెంట్ రైటర్ ఆఫీస్ దగ్ధం

కల్వకుర్తి, జనవరి 31 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో విద్యుదాఘాతంతో డాక్యుమెంట్ రైటర్ రవి ఆఫీస్ దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం సంఘటన స్థలానికి వెళ్లి డాక్యుమెంట్ రైటర్ రవిని పరామర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆఫీస్‌లో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయని డాక్యుమెంట్ రైటర్ మాదారం రవి ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ షాహెద్, ఖాదర్, హసన్, శివప్రసాద్ ఉన్నారు.

పల్లెల అభివృద్ధిలో సర్పంచ్‌లది కీలకపాత్ర

- మంత్రి జూపల్లి కృష్ణారావు



:పెద్దకొత్తపల్లిలో సర్పంచ్‌లను శాలువాలతో సన్మానిస్తున్న రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి, జనవరి 31 : పల్లెల అభివృద్ధిలో సర్పంచ్‌లది కీలక పాత్ర అని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి కావడంతో మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని ఎంపీడీవో సమావేశపు హాలులో వివిధ గ్రామాల సర్పంచ్‌లను మంత్రి జూపల్లి కృష్ణారావు శాలువాలతో సన్మానించి మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌ల సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, సర్పంచ్‌లు వి.సత్యం, ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, రాధ, మానస, పద్మ, చిన్నయ్య, రమేష్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గట్టయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగపూర్ విష్ణు, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు రవికుమార్, శశికళ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ అభివృద్ధి కోసం కృషి

నాయినోనిపల్లి మైసమ్మ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని దేవస్థానం దగ్గర నాయినోనిపల్లి మైసమ్మ దేవత చైర్మన్‌గా బుడుగు శ్రీనివాస్‌యాదవ్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించి మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైసమ్మ దేవత దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్‌ను సూచించారు. మైసమ్మ దేవత దగ్గరకు వచ్చే భక్తులకు కావాల్సిన అన్ని వసతులను ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా మార్చాలని ఆయన హామీ ఇచ్చారు. అంతకన్నా ముందు మంత్రి నాయినోనిపల్లి మైసమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ నాగర్‌కర్నూల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరి, ఈవో రంగారావు, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జడ్పీటీసీ మేకల గౌరమ్మ, సర్పంచ్‌లు ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, వి.సత్యం, పెద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగపూర్ విష్ణు, మాజీ ఎంపీపీ వేంకటేశ్వర్‌రావు, నాయకులు గోపాల్‌రావు, ఎ.కాశన్న, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మేకల చంద్రయ్య, మల్లయ్య, గండు చంద్రయ్య, దబ్బ ఎల్లయ్య పి.బాలస్వామి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

కొల్లాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం కొల్లాపూర్ మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామంలో మంత్రికి గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కుడికిళ్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు వేదిక భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల అభివృద్ధికై తాను ఎల్లప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలందిస్తానని పేర్కొన్నారు. కుడికిళ్ల గ్రామ రైతులు రైతు వేదిక భవనాలను సద్వినియోగపర్చుకోవాలన్నారు. నిరక్షరాస్యులైన దళితులను కూడా అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. జడ్పీటీసీ సభ్యురాలు జూపల్లి భాగ్యమ్మ, ఎంపీపీ భోజ్యానాయక్, కుడికిళ్ల గ్రామ సర్పంచ్ జ్యోతిరాము, సింగిల్ విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి రఘుపతిరావు, ఎంపీడీవో చెన్నమ్మ, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



మండల సర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

చారకొండ/ఉప్పునుంతల/వంగూరు, జనవరి 31: గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నా రు. బుధవారం చారకొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ గుండె నిర్మల. విజేందర్‌గౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, జడ్పీ వైస్‌చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్‌లు హాజరయ్యారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ నివేదికలు చదవి వినిపించారు. చంద్రాయన్‌పల్లి, శాంతిగుడెం, జూపల్లి సర్పంచులు వసంత, శ్రీనివాసులు, మల్లీశ్వరిలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సమస్య ఉందని, అదే విధంగా శిర్సనగండ్ల సర్పంచ్ యాతం శారద శ్రీనివాసులు గ్రామాల్లో ఒక కోటి ముప్పై లక్షలతో సీసీ రోడ్లు వేశామని.. నేటి వరకు బిల్లులు రాలేదని బిల్లులు మంజూరు చేసేవిధంగా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెలే వంశీకృష్ణ మాట్లాడారు. అనంతరం సర్పంచులకు ఎమ్మెల్యే శాలువా పూలమాలలతో సన్మానించారు. 24 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందిన ఎంపీడీవో జయసుదకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. వైస్ ఎంపీపీ బక్కమ్మ, పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, తహసీల్దార్ కేసీ ప్రమీల, ఎంపీడీవో వెంకటేష్, రైతుబంధు మండల అధ్యక్షుడు గజ్జె యాదయ్య, ఎంపీటీసీలు, ఏవో చిన్నహుసేన్‌యాదవ్, ఎంఈవో శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి

పాలకులు, అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం ఉప్పునుంతలలోని రైతు వేదిక భవనంలో ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన మండల ప్రత్యేక సర్వసభాసమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై మాట్లాడారు. సర్పంచులు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్ ఉంటే ఇప్పిస్తానన్నారు. అదే విధంగా గ్రామాల్లో మిగిలిన పనులు ఉంటే త్వరితగతిన చేపట్టాలన్నారు. అంతకు ముందు అధికారులు ఏజెండా వారిగా చదివి వినిపించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యుత్ సమస్యతో ఇబ్బంది ఎదుర్కొంటున్న సర్పంచ్ లక్ష్మీనారాయణ సభ దృష్టికి తీసుకరాగా కంసానిపల్లి గ్రామానికి నూతన విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల నుంచి రేషన్ షాపులు లేని గ్రామాల్లో మూడు రోజులు పాటు అక్కడికే డీలర్లు వెళ్లి సరుకులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ తబితారాణికి ఆయన సూచించారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులకు ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానం చేశారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై కలెక్టరుకు నివేదిక పంపాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్, పీఆర్‌డీఈ చంద్రకళ, తహసీల్దార్ తబితారాణి తదితరులు ఉన్నారు.

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

మండలంలోని జప్తిసదగోడు, ఉప్పరిపల్లి గ్రామంతో పాటు కోరటికల్, వెల్టూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. జప్తిసదగోడు వెల్టూరు, ఉప్పరిపల్లి గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలతో పాటు పల్లె దవాఖాన భవనానికి ఆయన ప్రారంభోత్సవంతో పాటు సీసీ రోడ్లుకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా ఉప్పునుంతల సింగిల్‌విండో ఆధ్వర్యంలో చేపట్టిన గోదాముకు ప్రారంభోత్సవంతో పాటు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. జడ్పీటీసీ సభ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ అరుణ, సర్పంచులు ఇంద్రాసేనారెడ్డి, మల్లారెడ్డి, సరిత, రమేష్ రెడ్డి, సుగుణమ్మ, ఎంపీటీసీ సభ్యులు కవిత, అనురాధ, రంగారెడ్డి, అంతటి నాగయ్య, వైద్యాధికారి బిక్కునాయక్, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, మహబూబ్ నగర్ డీసీసీబీ సీఈవో లక్ష్మయ్య ఉప్పునుంతల సీఈవో రవీంద్రారావు, నాయకులు అనంతరెడ్డి, నర్సింహరెడ్డి, నర్సింహరావు, చిన్నజంగిరెడ్డి ఉన్నారు. అలాగే, మండల పరిధిలోని తాడూరు, సీబీ తండా గ్రామపంచాయతీలలో నూతనంగా నిర్మించిన భవనాలకు బుధవారం ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు.

అదే విధంగా ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచులు పద్మ, సేవానాయక్ ఉన్నారు.

● అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అబివృద్ధి సాధ్యమని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం వంగూరు మండలంలోని గాజర గ్రామంలో నూతనంగా నిర్మించిన వైకుంఠ ధామాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ లక్ష్మమ్మ, ఎంపీడీవో విజయ్‌భాస్కర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పండిత్‌రావు, ఎద్దుల శ్రీనివాస్‌గౌడ్, ముఖేష్‌యాదవ్, శంకరయ్యయాదవ్, రాజయ్యయాదవ్, శ్రీను. కుర్మయ్య, యాదయ్య, సుధాకర్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని అడుగులు వేయాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

తెలకపల్లి, జనవరి 31 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు అడుగులు వేయాలని ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సూచించారు. బుధవారం తెలకపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులు సమీకృత కలెక్టరేట్ భవనాన్ని సందర్శనకై వచ్చిన సందర్భంగా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడుతూ రానున్న ఇంటర్, పదవ తరగతి పరీక్షల్లో సత్తా చాటాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాన్ని చేరుకునేలా ప్రతీ అంశాన్ని లోతుగా విశ్లేషిస్తూ నూతన పరిశోధనలు చేయాలన్నారు. రోజురోజుకు టెక్నాలజీపరంగా ఎన్నో మార్పులు వస్తున్నాయని, వాటిని ఆకలింపజేసుకుని ముందుకు పోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందజేసే మెనూ ఇతర వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ భవనంలోని అన్ని శాఖల విభాగాలను సందర్శించేందుకు కలెక్టర్ విద్యార్థులకు అనుమతినిస్తూ మూడు ఫ్లోర్లను ఏఏ విభాగాలు ఎక్కడున్నాయో వివరించేలా అధికారిని ఏర్పాటు చేసి చూయించాలని కలెక్టర్ సూచించారు. కొత్తగా గురుకుల పాఠశాల నిర్వహణ కమిటీకి ఎన్నికైన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థినుల వెంట తెలకపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలత అన్నారు.

పల్లెల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర

బిజినేపల్లి, జనవరి 31 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించి పల్లెలను అభివృద్ధి పర్చడంలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అని ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీల సంఘం జిల్లా కన్వీనర్ మంగి విజయ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశపు హాల్‌లో బుధవారంతో పదవీ కాలం ముగిసిన సర్పంచ్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పథకాలకు నిధులు విడుదల చేయడం ద్వారా గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చిన ఘనత సర్పంచ్‌లకే దక్కుతుందన్నారు. ఆసరా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రైతుబంధు, దళితబంధు, బీసీబంధు, సీఎం రిలీఫ్‌ఫండ్, ఎల్‌ఓసీ వంటి ఎన్నో సంక్షేమ పథకాల ఫలాలను నిజమైన అర్హులకు అందించేందుకు కృషి చేశారని కొనియాడారు. భగీరథ పథకం ద్వారా తాగునీరు, పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి ట్రాక్టర్, డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రస్తుతం ఉన్న సర్పంచ్‌లుగా చేపట్టడం వల్ల గ్రామస్థులు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు తమ అనుభవాలను వివరించారు. ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీవో రాములు నాయక్, సర్పంచ్‌లు బాలీశ్వర్, అశోక్, అవంతి, లావణ్య అమృత్ రెడ్డి, వంగ సుదర్శన్ గౌడ్, ముడావత్ సాలెమ్మ, ఎంపీటీసీ సభ్యులు అంజనేయులు, తిరుపతయ్య, రాధా తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్లమలలో కొనసాగుతోన్న రేంజ్ అధికారుల శిక్షణ

మన్ననూర్, జనవరి 31: అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం(ఏటీఆర్)లో మహారాష్ట్రకు చెందిన ట్రైనీ రేంజ్ అధికారులకు రెండో రోజు బుధవారం శిక్షణ తరగతులు కొనసాగాయి. మన్ననూరు రేంజ్ పరిధిలోని సంపన్ పడేలు వద్ద గడ్డి క్షేత్రాలను సందర్శించారు. శాఖాహార జంతువులకు గడ్డి మేతగా ఉపయోగించే విధానాన్ని బయాలజిస్ట్ రజనికాంత్ అవగాహన కల్గించారు. అలాగే వన్యప్రాణులకు తాగునీటి వసతి కల్పించే పర్క్యులేషన్ ట్యాంకులు, సౌరశక్తి బోర్‌వెల్, సాసర్ పిట్లను పరిశీలించారు. గుండం వాగు నుంచి 4 కిలోమీటర్లు కాలినడక (ట్రక్కింగ్) చేశారు. నడక మధ్యలో పెద్దపులి, చిరుతపులి, ఎలుగుబంటి పేడలను చూయిస్తూ శిక్షణ రేంజర్లకు వివరించారు. నల్లమల వన్యప్రాణులు దాహార్తిని తీర్చే పిచ్చకుంట్లోని చెరువును సందర్శించారు. ఇదే సందర్భంలో ఫర్హాబాద్ వ్యూపాయింట్‌కు తీసుకెళ్లి ఇక్కడికి ఇకో టూరిజంలో భాగంగా సఫారీకి వచ్చే పర్యాటకులకు చూపించే నల్లమల ప్రదేశాలు, ప్యాకేజీ వివరాలను ట్రైనీలకు స్థానిక అధికారులు వివరించారు. మన్ననూరు ఇన్‌చార్జి రేంజ్ అధికారి రవికుమార్, బీట్ అధికారి మధు పాల్గొన్నారు.

క్యాంపు ఆఫీస్‌లోకి అడుగుపెట్టిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

- కార్యక్రమానికి హాజరైన మంత్రి జూపల్లి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 31: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి తన అధికారి నివాసం ప్రజాపాలన భవన్ (క్యాంప్ ఆఫీస్)లోకి ప్రవేశించారు. బుధవారం ఉదయం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ఆయన సతీమణి సరితతో కలిసి వేద పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించి క్యాంపు ఆఫీస్‌లోకి అడుగుపెట్టారు. కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ హాజరై పూజలో పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజల సమస్యలు పట్టించుకుని పరిష్కరించడంతో పాటు వారి సుఖసంతోషాలతో జీవించాలనే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిమ్మాజిపేట, జనవరి 31 : తిమ్మాజిపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన పొట్ట యాదయ్య(45) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఇద్దరు వ్యక్తులతో కలిసి యాదయ్య ఇంటి నుంచి బయటకి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు.. చుట్టుపక్కల ఎక్కడా వెతికినా జాడ తెలియరాలేదని బుధవారం పొద్దునే వ్యవసాయ పొలం వెళ్లి చూడగా పొలం వద్ద మెడకు టవల్ చుట్టి ఉండడాన్ని కుటుంబీకులు గమనించగా, అప్పటికే మృతి చెందినట్లు కుమారుడు శివప్రసాద్ తెలిపాడు. తన తండ్రిని వెంట వెళ్లిన ఇద్దరే గొంతు నులిమి చంపి ఉంటారని అనుమానిస్తూ కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లకు డీఎస్సీలో అవకాశం కల్పించాలి'

తెలకపల్లి, జనవరి 31 : ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లకు రాబోయే డీఎస్సీలో అవకాశం కల్పించాలని నాగర్‌కర్నూల్ ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ల జిల్లా అధ్యక్షుడు పులిజాల రామస్వామి అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ త్వరలో వేసే మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ నియామక ఉద్యోగ నోటిఫికేషన్‌లో జాతీయ విద్యావిధానం ఎన్‌సీఈఆర్‌టీ నిబంధనల ప్రకారం ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో ఆర్ట్‌క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల పోస్టులు భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

సీఐగా కే.మహేష్ బాధ్యతల స్వీకరణ



సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న కే.మహేష్

కొల్లాపూర్, జనవరి 31 : కొల్లాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కే.మహేష్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నల్గొండ జిల్లా సూర్యాపేట నుంచి కొల్లాపూర్ సీఐగా బదిలీపై వచ్చిన కే.మహేష్ రాగా ప్రస్తుతం పని చేస్తున్న సీఐ యాలాద్రి హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన మహేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్‌శాఖ ఎల్లప్పుడు పని చేస్తుందని, అసాంఘిక కార్యక్రమాలకు, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవని, ఎవరినీ ఉపేక్షించేది లేదని ఆయన పేర్కొన్నారు.

పెంట్లవెల్లి ఎస్ఐగా రామన్‌గౌడ్

పెంట్లవెల్లి, జనవరి 31 : పెంట్లవెల్లి ఎస్ఐ గా బుధవారం రామన్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నాగర్‌కర్నూల్ ఎస్పీ ఆఫీస్‌లో వీఆర్‌గా ఉన్నారు. బదిలీపై పెంట్లవెల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని వారు పేర్కొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

కొల్లాపూర్, జనవరి 31 : సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుండడంతో బుధవారం మండల ఎంపీపీ భోజ్యానాయక్ మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లను సన్మానించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమానికి ఎంపీపీ భోజ్యానాయక్, జడ్పీటీసీ సభ్యురాలు జూపల్లి భాగ్యమ్మ హాజరయ్యారు. ఐదు సంవత్సరాల పాటు గ్రామాల అభివృద్ధికి తమ వంతు కృషి చేసిన సర్పంచ్‌లను వారు అభినందిస్తూ సర్పంచ్‌లకు శాలువా, పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో చెన్నమ్మ, మండల పరిషత్ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● లింగాల: గ్రామ పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం గురువారం ముగిసిన సందర్భంగా మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులను పలు పార్టీల నాయకులు, ప్రజలు ఘనంగా సన్మానించారు. గత ఐదు సంవత్సరాల కాలంలో వారు నిర్వహించిన పలు అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు. లింగాల మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాకం తిరుపతయ్య, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కేటీ తిరుపతయ్య, సర్పంచు కోనేటి తిరుపతయ్య, వార్డు సభ్యులను సన్మానించారు.

● ఉప్పునుంతల: మండలంలోని అన్ని గ్రామ సర్పంచులకు బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఏర్పాటు చేసిన మండల ప్రత్యేక సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శాలువా కప్పి సన్మానం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ అరుణ, ఎంపీడీవో లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ తబితారాణి, నాయకులు అనంతరెడ్డి, నర్సింహరెడ్డి తదతరులు ఉన్నారు.

'వృద్ధాశ్రమ నిర్వహణకు అండగా ఉంటా'

కల్వకుర్తి, జనవరి 31 : వృద్ధాశ్రమ నిర్వాహణకు అండగా ఉంటానని, పేదలకు, సామాన్యులకు చేయూతగా నిలుస్తానని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కాయితీ ఆశాదీప్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో ప్రజల భాగస్వామ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేయబోయే వృద్ధాశ్రమం నిర్వహణ కొరకు రూ. 50వేలను వృద్ధాశ్రమ నిర్వాహకుడు వెంకటయ్యకు ఆశాదీప్‌రెడ్డి అందజేశారు. ఇలానే వృద్ధులకు సేవలు కొనసాగించేందుకు త్వరలోనే మరింత ఆర్థిక సహాయాన్ని అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆశాదీప్‌రెడ్డి, అనుచరులు అశోక్, సుదర్శన్, అనిల్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ రెఫరీగా పీఈటీ రామన్‌గౌడ్



నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 31: ఈ నెల 1 నుంచి 4 వరకు హైదరాబాదులో తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న 49వ జాతీయ స్థాయి కబడ్డీ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల కోసం రెఫరీగా పీఈటీ రామన్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జనార్దన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ టెక్నికల్ బోర్డు చైర్మన్ అనిల్‌కుమార్ సూచన మేరకు రెఫరీగా రామన్‌గౌడ్‌ను ఎంపిక చేశామని తెలిపారు. రామన్‌గౌడ్ ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డితో పాటు కార్యదర్శి యాదయ్యగౌడ్, జిల్లా క్రీడల అధికారి సీతారాం, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసులు, శేఖర్‌బాబు, మల్లయ్య కుమారస్వామి, సత్యనారాయణ, మోహన్‌లాల్, రమేష్, ప్రకాష్ అభినందనలు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 31 : వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఎర్రిస్వామి అన్నారు. 37వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా రవాణా కార్యాలయంలో డ్రైవర్లకు రోడ్డు భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు సలహాలు చేశారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవి, అనుదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగాల, జనవరి 31:మండలంలోని మగ్దూంపూర్ చౌరస్తా దగ్గర ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం సాంకేతిక లోపాలను సరిచేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని ఏఈ తెలిపారు.

విద్యాబోధనపై అవగాహన కలిగి ఉండాలి

బల్మూరు, జనవరి 31 : ప్రణాళికబద్ధమైన లక్ష్యాలతో విద్యా బోధనను అభ్యసించి పరిపూర్ణంగా విద్యనభ్యసించే విధంగా మండలం లోని పాఠశాల విద్యార్థులు కృషి చేయాలని ఎంఈవో రా మారావు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సిబ్బందితో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.